క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

వినుకొండ: పట్టణంలోని 15వ వార్డు ప్రభుత్వ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రి ఎంఈవో సయ్యద్ జఫ్రుల్లా చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగించుకొని బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో దాత బత్తుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బి.వి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు



నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బెంగుళూరుకు చెందిన థింగ్‌సింక్ సంస్థ బుధవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించి 23 మంది ఉద్యోగాలకు ఎంపిక చేసింది. ఆన్‌లైన్‌లో నిర్వహించిన డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 45 మంది విద్యార్థులు పాల్గొనగా వీరికి పలు రౌండ్లలో పరీక్షలు నిర్వహించి 23 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు రూ.2.5 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.మల్లికార్జున్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ ఎ.కిషోర్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

చిలకలూరిపేట ఎంఈవోగా శ్రీనివాసరావు

చిలకలూరిపేట: మండల విద్యాశాఖాధికారి-1గా అనంతవరం శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సత్తెనపల్లి ఎంఈవోగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎంఈవోగా ఉన్న కె.లక్ష్మి ఇటీవల ఏసీబీ అధికారుల దాడిలో పట్టుబడటంతో ఆమె స్థానంలో బదిలీపై శ్రీనివాసరావు వచ్చారు. ఆయనకు ఎస్టీయూ నాయకులు పోటు శ్రీనివాసరావు, మేకల కోటేశ్వరరావు, వి.జయప్రకాశ్, వి.అక్కయ్య, ఐ.అంకమ్మరావు తదితరులు కలసి అభినందనలు తెలిపారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

నూజెండ్ల: కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా అందిస్తున్న పశుబీమా యోజన పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శివాజీ అన్నారు. బుధవారం నూజెండ్ల గ్రామంలో రైతులకు బీమా యోజన సౌకర్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యంతో, ఇతర కారణాలు వల్ల పాడి గేదెలు మృత్యువాత పడితే బీమా సౌకర్యం ద్వారా కొంతమేర నష్టాన్ని నివారణకు దోహదపడుతుందన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు 80 శాతం, లబ్ధిదారుడు 20 శాతం చెల్లిస్తే బీమా వర్తిస్తుందన్నారు. ఒకసారి ప్రీమియం చెల్లిస్తే మూడు సంవత్సరాలు కాలపరిమితి అన్నారు.

వృత్తి, వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు చెల్లించాలి



నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో వృత్తి, వ్యాపార దుకాణదారులు పంచాయతీకి ఫీజు చెల్లించి లైసెన్సులు పొందాలని పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు చెప్పారు. ఈ మేరకు సచివాలయం సిబ్బందితో కలిసి దుకాణదారులకు డిమాండ్ నోటీసులు అందించారు. 43 రకాల వృత్తి, వ్యాపార సేవలకు గాను కనిష్ఠంగా రూ.200ల నుంచి గరిష్ఠంగా రూ.1000ల వరకూ పంచాయతీకి ఫీజు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు అందించారు. ప్రతి ఏడాది మార్చి నెలలో చెల్లించి రశీదులు పొందాలని కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంచాయతీ సిబ్బంది పన్నులు వసూలుకు పూనుకోవటంపై చిరువ్యాపారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంపద సృష్టి అంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఇలా తమపై పన్నుల భారం మోపేందుకేనా అంటూ ప్రశ్నిస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై విద్యార్థులకు అవగాహన



వినుకొండ: స్వచ్ఛ సర్వేక్షణ్ 2025, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ వినుకొండ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నారాయణ స్కూల్ నందు సోర్స్ సెగ్రిగేషన్ అవేర్నెస్ కాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మూడు డబ్బాల వాడకం చెత్తను వేరు (తడి పొడి గృహ సంబంధిత ప్రమాదకర) చేయుట, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలుగు నష్టాలు, వ్యక్తిత్వ వికాసం, పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, వార్డు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, స్కూల్ ప్రిన్సిపాల్, స్కూల్ టీచర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్ అంతా ప్రకృతి సాగు విధానమే

- సీడబ్ల్యూసీ మేనేజర్ వంశీకృష్ణ
- ఢిల్లీ బృందం ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శన
- చెంఘీజ్‌ఖాన్‌పేట ప్రకృతి సాగు పంటల పరిశీలన
- రైతులతో సాగు అంశాలపై సమీక్ష



చెంఘీజ్‌ఖాన్‌పేట రైతు శ్రీనివాసరావు క్షేత్రంలో పరిశీలిస్తున్న దృశ్యం

యడ్లపాడు: రసాయన కాలుష్యం లేకుండా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించే అవకాశం ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమని న్యూఢిల్లీకి చెందిన పీడబ్ల్యూసీ (ప్రైస్ వాటర్ హౌస్ కూపర్) మేనేజర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం కె.అమలకుమారి, జిల్లా సిబ్బందితో యడ్లపాడు మండలం చెంఘీజ్ ఖాన్‌పేట గ్రామాన్ని పీడబ్ల్యూసీ బృందం బుధవారం సందర్శించింది. స్థానిక రైతులతో కలిసి ప్రకృతి విధానంతో సాగు చేస్తున్న పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఇందులో భాగంగా ఒకే క్షేత్రంలో బహుళ పంటలు పండిస్తున్న రైతు సీహెచ్ శ్రీనివాసరావు కలిసి బొప్పాయి, ఆకుకూరలు, కూరగాయలు, పూల సాగును ప్రకృతి విధానంతో చేయడం గమనించారు.

సాగులో కొత్త మార్గదర్శకత్వం..

ప్రకృతి వ్యవసాయంతో పండిన పంటలు పోషక విలువలతో కూడినవేనన్నారు. నేలసారాన్ని పెంచితూ వ్యవసాయాన్ని దీర్ఘకాలం కొనసాగించేందుకు ఈ సేద్యం ఉత్తమమార్గమని డీపీఎం కె.అమలకుమారి బృందానికి తెలిపారు. ఏటా తొలకరి వర్షాలకు ముందే పీఎండీఎస్ పద్ధతిలో 30 రకాల విత్తనాలు నాటడం ద్వారా ప్రధాన పంటలకు చీడపీడలు దరిచేరకుండా ఉండే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయంలో కొత్త మార్గదర్శకత్వం సూచిస్తూ ఏటీఎం మోడల్ వంటి నూతన పద్ధతులు రైతులకు నిరంతర ఆదాయ మార్గాలను అందిస్తున్నాయని చెప్పారు.

రైతు సేవా కేంద్రం వద్ద సమీక్ష

గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో బృందం సభ్యులు, జిల్లా అధికారులతో సమీక్ష ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల నిర్వహణ విధానాన్ని సమీక్షించారు. రైతులతో నేరుగా మాట్లాడి ఈ విధాన సాగు చేయడంతో వలన కలిగే లాభనష్టాలను తెలుసుకున్నారు. నేలసారం, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు వృద్ధి ప్రకృతి సేద్యంలో గమనించినట్లు రైతులు బృందానికి తెలిపారు. అన్నింటికీ మించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులను సాధిస్తున్నట్లు వివరించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ స్ఫూర్తి కొనసాగాలని, మరింత మంది రైతులు ఈ పద్ధతిని అవలంబించి స్వయం సమృద్ధిని సాధించాలని బృందం సభ్యులు ఆకాంక్షించారు. భావితరాల ఆరోగ్యాన్ని కాపాడే అవకాశం ప్రకృతి విధానంలో మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి.స్వాతి, సౌజన్య, అప్పలరాజు, నందకుమార్ పాల్గొన్నారు.

కొచ్చర్లలో కేంద్ర బృందం పర్యటన



గ్రామసచివాలయంలో కేంద్రం టీం సభ్యులు

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని కొచ్చర్ల గ్రామంలో కేంద్ర టీం సభ్యులు పర్యటించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి లబ్ధిదారులను బుధవారం అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో నీతి అయోగ్ టీం సభ్యులు న్యూఢిల్లీ సంబోధ రీసెర్చ్ కమ్యూనికేషన్స్ ఫీల్డ్ మేనేజరు అండ్ కోఆర్డినేటరు వికాస్ మల్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన ,స్వయ సహాయక సంఘాలు, పింఛన్లు పంపిణీ, గ్రామీణ సడక్ యోజన, గ్రామ స్వరాజ్య అభియాన్ తదితర పథకాల గురించి లబ్ధిదారులతో మాట్లాడారు. పథకాల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, అర్హులకు అందుతున్నాయా తదితరవన్నీ క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఆయనతో పాటు సర్పంచ్ కొప్పెర దేవరాజ్, మాజీ ఎంపీపీ అయినాల కోటేశ్వరరావు, ఎంపీడీవో కె.ప్రభాకర్‌రావు, ఈవోపీఆర్‌డీ ఎన్.రత్నం, పంచాయతీ కార్యదర్శి బాలు నాయక్, కేంద్ర టీం సభ్యులు వి.సంధ్యారాణి, లక్ష్మి, లోకేష్, జి.సంధ్యా,భానుచంద్ర, హౌసింగ్ డీఈ ఎన్.శ్రీనివాసరావు, ఏఈ రసూల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రీసర్వే పనుల్లో సందేహాలు నివృత్తి చేయాలి



రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో

నూజెండ్ల: రీసర్వే పనుల్లో రైతుల సందేహాలు నివృత్తి చేయాలని నరసరావుపేట ఆర్డీవో కె.మధులత అన్నారు. బుధవారం మండలంలోని త్రిపురపురం రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీవో కె.మధులత మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల భాగస్వామ్యంతో రెవెన్యూ అధికారులు రీసర్వే పనులు పారదర్శకంగా చేయాలన్నారు. భూములు కొలతలు విస్తీర్ణం తీయు రైతులందరికీ నోటీసులు అందజేయాలన్నారు. త్రిపురపురం రెవెన్యూ గ్రామంలో 3400 ఎకరాలు ఉండగా ఇప్పటి వరకు 812 ఎకరాలు రీసర్వే పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు రెండు రోవర్ యంత్ర పరికరాలు ద్వారా మూడు టీమ్స్ సారథ్యంలో పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలిపారు. విధుల్లో అలసత్వం వహిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పన్ను వసూళ్లలో రోజువారీ లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట: పురపాలక సంఘ పరిధిలో ఆస్తి, నీటి పన్నులను రోజువారీ లక్ష్యాలను మేరకు వసూలు చేయాలని కమిషనర్ ఎం.జస్వంతరావు పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ అతిథి గృహంలో వార్డు సచివాలయాల కార్యదర్శులు, మున్సిపల్ రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బకాయిలు ఉన్న ప్రతి ఒక్క యజమాని నుంచి పన్నులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికోసం మున్సిపల్, సచివాలయ సిబ్బందితో టీంలను ఏర్పాటు చేయటం జరిగిందని, మార్చి 31 నాటికి వందశాతం వసూలు చేయాలని కోరారు. జీఐఎస్ సర్వేలోని అసెస్ చేయని, తక్కువగా అసెస్ చేసిన వివరాల మేరకు సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరు కనకారావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బెయిలీబాబు, సయ్యద్ జహంగీర్ పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



నాదెండ్ల: గణపవరం-కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యడ్లపాడు ఎస్సై బాలకృష్ణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాట్రు శ్రీనివాసరావు, సభ్యులు కాట్రు కృష్ణారావు, కెల్లంపల్లి అచ్చయ్య ఎస్సై బాలకృష్ణను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని పూర్తి రాతితో నిర్మించి ప్రతి ఏడాది వార్షికోత్సవం వైభవంగా నిర్వహించటం అభినందనీయమన్నారు.

పిల్లల్లో పాజిటివ్ దృక్పథం రావాలి

- ఆ బాధ్యత తల్లిదండ్రులదే
- డైట్ కళాశాల అధ్యాపకులు పోలేరు



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

యడ్లపాడు: పిల్లల్లో పాజిటివ్ దృక్పథాన్ని తీసుకురావాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని వారిని చైతన్యం చేయాల్సిన బాధ్యత అంగన్‌వాడీలదేనని డైట్ కళాశాల అధ్యాపకులు వి.పోలేరు అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం బుధవారం రెండోరోజు కొనసాగింది. జ్ఞానజ్యోతి పేరిట జగ్గాపురం, లింగారావుపాలెం గ్రామాల్లోని జెడ్పీ హైస్కూల్స్‌లో 6 రోజులు పాటు కొనసాగే ఈ శిక్షణకు 80 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమం అబ్జర్వర్‌గా పోలేరు పర్యవేక్షణలో కీ రీసోర్స్ పర్సన్ పి.నిర్మలారాణి, డీఆర్‌పీలు వి.ఉమామహేశ్వరరావు, ఎం.జోజమ్మ, వెంకటరమణ, హనుమాయమ్మ, మునియ్య శిక్షణ అందించారు. నూతన విద్యావిధానంలో భాగంగా 3-8 ఏళ్ల పిల్లల విద్యా, ఆరోగ్యం సమగ్ర అభివృద్ధికి, పీపీ-1,2 అలాగే 1,2,3 తరగతుల పిల్లలకు విద్యాబోధన అవసరమైన లోకాస్ట్-నోకాస్ట్‌తో టీఎల్‌ఎం తయారీ, బోధన ప్రక్రియపై శిక్షణ ఉంటుందన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి



పంట పొలం పరిశీలిస్తున్న జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి, వ్యవసాయ అధికారులు

చిలకలూరిపేట: రైతులందరూ తప్పనిసరిగా తాము సాగు చేస్తున్న పంట వివరాలను నమోదు చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏం శివకుమారి చెప్పారు. మండలంలోని రాజాపేట, గోపాళంవారిపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదు కావాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకొని ఫార్మర్ ఐడీ వచ్చిన వారికి మాత్రమే సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందజేయడంతో పాటు పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని వెల్లడించారు. శనగలో కాంప్లెక్స్ ఎరువుల బదులుగా యూరియా, ఎంవోపీ వాడడం వలన అధిక దిగుబడులతో పాటు గింజ నాణ్యత పెరుగుతుందని తెలిపారు. మిరపలో గంధకం వాడడం వలన తాలుకాయ రాకుండా నివారించవచ్చన్నారు.

కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి శ్రీలత, ఏఈవో శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సంచార జాతులను ఆదుకోవడం అభినందనీయం



చిలకలూరిపేట: సంచార జాతులకు చెందిన నిరుపేదలను ఆదరించటం అభినందనీయమని ఇన్‌కంటాక్స్ రిటైర్డ్ అధికారులు యడ్ల అయ్యన్న, బహుజంకు రాజేశ్వరరావు చెప్పారు. జ్ఞానేశ్వరీ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వేలూరు రోడ్డులో నివాసం ఉంటున్న గంగిరెద్దులు ఆడించే నిరుపేద కుటుంబాలకు బుధవారం నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలను గుర్తించి వారికి సహాయం అందిస్తున్న గార్ఫ్స్ సంస్థ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గార్ఫ్స్ సంస్థ ప్రతినిధులు దాసరి చిట్టిబాబు, గేరా యాకోబు, జెట్రిపోతుల బుల్లిబాబు, వడ్లాన చంద్రం, దార్ల బుజ్జిబాబు, షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు.

సుబాబుల్, జామాయిల్ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

చిలకలూరిపేట: సుబాబుల్, సరుగుడు, జామాయిల్ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సామాజిక వన రైతు సంఘం రాష్ట్ర సమితి అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి బాబురావు, బి.హనుమారెడ్డి కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ సుబాబుల్, జామాయిల్, సరుగుడు రేటు బాగా తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదని, దళారులు, పేపర్ కంపెనీలు కూడబలుక్కొని ధరను తగ్గించటంతో టన్నుకు వేల రూపాయల మేర నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ నిర్వహించిన యూకలిప్టస్ వేలంలో అక్రమాలు జరుగుతున్నాయని, కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి కారుచౌకగా టెండర్లు కొట్టేస్తున్నారని విమర్శించారు. వేలంలో దక్కించుకున్న దానికన్నా ఎక్కువ మొత్తంలో నరికివేస్తూ లెక్కల్లోకి రాకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనివల్ల అటవీశాఖకు, జామాయిల్ పెంచే రైతులకు నష్టం చేకూరుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు చంద్ర కొండలరావు, కందిమళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అవినీతికి తావులేకుండా విధులు నిర్వహించాలి



సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న తహసీల్దారు సురేష్ నాయక్

శావల్యాపురం: రెవెన్యూ అధికారులు పిర్యాదులకు అవినీతికి తావులేకుండా తమ విధులు బాధ్యత నిర్వహించాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు సబవత్ సురేష్ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వీఆర్వోలు,వి అర్ఎ, కార్యాలయ సిబ్బంది పరిచయ అనంతరం సమీక్షి నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్జీలు పెండింగ్‌లో లేకుండా సకాలంలో పరిష్కారించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు సమయపాలనలో పాటు ప్రతి ఒక్కరు గుర్తింపు కార్డులను ధరించాలన్నారు. అర్జీలు తిరస్కరణ చేస్తే అందుకుగల కారణాలు లబ్ధిదారులకు వివరించాలన్నారు. ఆర్జీదారుల నుంచి రూపాయి ఆశించకుండా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. ఈసమావేశంలో సర్వే అధికారి పేరిసోముల నాసరయ్య, ఆర్ఐ చంద్రబాబు, సర్వేయర్ యం.రాజు ఉన్నారు.

నోటీసులిచ్చి.. చేతులు దులుపుకున్నారు!

- అల్లూరివారిపాలెం ఎస్టీ కాలనీ ఆక్రమణలపై స్పందించిన అధికారులు
- ఆక్రమణదారులకు నోటీసులు అందజేసిన రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది

నరసరావుపేట రూరల్: అల్లూరివారి పాలెంలోని ఎస్టీ కాలనీలో అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలంటూ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. అదిగో జాగా వేసేయ్ పాగా అంటూ సాక్షిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలోని ఎస్టీ కాలనీ లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలకు గ్రామ వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి బుధవారం నోటీసులు జారీ చేశారు. నిర్మాణాలు ఆపాలంటూ ఆక్రమణదారులకు సూచించారు. నోటీసులు అందుకున్న ఆక్రమణదారులు అధికారులు ఉన్న కొంత సేపు పనులు నిలిపి వేసి తరువాత యథావిధిగా పనులు చేపట్టారు. దాదాపు రూ.2 కోట్ల విలువైన 33 సెంట్లు భూమి ఆక్రమణకు గురవుతున్నా జిల్లా ఉన్నతాధికారులు సైతం కఠిన చర్యలకు ఉపక్రమించకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కలెక్టర్ కార్యాలయంతో పాటు జిల్లా అధికారుల కార్యాలయాలకు కూత వేటు దూరంలోనే ఈ ఆక్రమణలు జరుగుతున్నా ఉన్నతాధికారులు నామమాత్రంగా స్పందించడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అధికార పార్టీ నాయకులే ఆక్రమణకు పాల్పడటంతో అధికారులు చర్యలకు వెనకడుగు వేస్తున్నట్టు సమాచారం.

రొంపిచర్లలో వానరానికి అంతిమ సంస్కారాలు



వాహనంపై అలంకరించిన వృద్ధ వానర మృతదేహాన్ని తరలిస్తున్న గ్రామస్తులు

రొంపిచర్ల: మారుతిగా భావించే వృద్ధ వానరం మృతి మండల కేంద్రమైన రొంపిచర్ల ప్రజల మనసులను కలచివేసింది. వయోభారంతో అనారోగ్యానికి గురైన వానరం (కోతి) బుధవారం ఉదయం మృతి చెందింది. ఇటీవల కాలంలో గోడలమీద, చెట్లపైన కొమ్మలకు వేలాడుతూ కోతులన్నీ చిత్తపనులు చేస్తూ గంతులు వేస్తుంటాయి. అయితే వయోభారంతో ఓ వృద్ధ కోతి గత కొన్ని రోజులుగా నీరసంగా కనిపించింది. ఆ కోతికి గ్రామస్తులు ప్రేమతో పండ్లు, పలహారాన్ని ఆహారంగా అందిస్తుండేవారు. అయితే ఆహారం కూడా తినలేని స్థితిలో రోజురోజుకు నీరసించి పోయింది. బుధవారం ఉదయం వృద్ధ కోతి మృతి చెంది ఉండటాన్ని గ్రామస్తులు గమనించారు. వానరం మృతి విషయం ఆనోటా ఈ నోటా పాకి సగం ఊరుకు తెలిసింది. వెంటనే ఆ వీధివారు కోతికి ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి, పూజలు చేసి అంతిమ యాత్ర నిర్వహించారు. అనంతరం అంతిమ సంస్కారాలు కూడా చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ పడాల నాగిరెడ్డి, గ్రామంలోని పలువురు మహిళలు పాల్గొన్నారు. దారి పొడవునా మారుతికి నివాళి అర్పిస్తూ, భజనలు చేస్తూ అంతిమయాత్ర సాగించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



నరసరావుపేట రూరల్: ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్తా, జాయింట్ సెక్రటరీ వూటుకూరి వెంకటఅప్పారావు, కమిటీ సభ్యుడు బత్తుల వెంకటమురళీధర రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ఆశయాలతో, కొత్త కలలతో కళాశాలలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసాయి,అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనవ్యర్థాల నిర్వహణతో అదనపు ఆదాయం

నరసరావుపేట రూరల్: ఘన వ్యర్థాల నుంచి సంపద సృష్టించడం ద్వారా పంచాయతీకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి తెలిపారు. మండలంలోని ములకలూరు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను బుధవారం ఎంపీడీవో సందర్శించారు. వర్మీ తొట్టులలో వర్మీ కంపోస్టు కోసం వానపాములను వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ ద్వారా సంపద సృష్టించే ఉద్దేశ్యంతో ఎస్‌డబ్ల్యూపీసీలను ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. గ్రామంలో సేకరించిన చెత్తను సద్వినియోగం చేసుకోవడం వలన ఆదాయం పొందవచ్చని అన్నారు. ఈ కేంద్రం ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం లభిస్తుందని తెలిపారు. అనంతరం కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నాగానంద్, గ్రామ సర్పంచ్ యేసుదయ, పంచాయతీ కార్యదర్శి రామసీత, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే జీవీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు, కార్మికులు

వినుకొండ: మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మారుతీ వరప్రసాద్, కార్మికులు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రవ్యాప్త పోరాటాల్లో భాగంగా ఎమ్మెల్యేను కలిసినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 17వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికుల వేతనాలు చెల్లించాలని, ఔట్‌సోర్సింగ్, పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బూదాల శ్రీనివాసరావు, రాయబారం వందనం, వెంకటేశ్వర్లు, సంపెంగుల అబ్రహాంరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజారావు మృతికి బొల్లా నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: వినుకొండ మండలం ఏనుగుపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నాగండ్ల రాజారావు మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సందర్శించి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజారావు మృతి పార్టీకి తీరని లోటని బొల్లా అన్నారు. రాజారావు కుటుంబాన్ని పార్టీ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.